క్లుప్తంగా

ఎంపీ దృష్టికి ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై విశాఖ ఎంపీ భరత్ దృష్టికి శుక్రవారం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు రెండు నెలల నుంచి 6 నెలల పాటు జీతాలు చెల్లించడం లేదన్నారు.50 ఏళ్లు నిండిన కార్మికులకు వైద్య పరీక్షలు చేసి తొలగించాలని చూస్తున్నారన్నారు. ఎంపీను కలిసిన వారిలో రమణ, రవి, పిట్టారెడ్డి, వంశీ, తాతారావు, బొద్దు పైడిరాజు, రాజేష్, నరసింగరావు పాల్గొన్నారు.

28 నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. 28న మధ్యాహ్నం 3 గంటల సమయంలో దయాల్‌నగర్‌లోని సేవా సంఘం కార్యాలయం నుంచి పెదగంట్యాడ, నెల్లిముక్కులోని పెంటమాంబ అమ్మవారి ఆలయం వరకూ వరి దుబ్బును ఊరేగించి అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్టు తెలిపారు.

3 నుంచి అన్నసమారాధన

అక్కిరెడ్డిపాలెం: కార్తీకమండల కాలాన్ని పురస్కరించుకుని షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో నిత్య అన్న సమారాధన నిర్వహించనున్నట్లు గురుస్వామి అదపాక వెంకటరమణ తెలిపారు. శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో 3 నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు (బుధవారాలు మినహా) అన్న సమారాధన ఉంటుందని చెప్పారు.

టూరింగ్ టాకీస్ to ఐనాక్స్

- గాజువాకలో తొలి థియేటర్ నర్సింహ టూరింగ్ టాకీస్
- ప్రాచుర్యంలో మాత్రం మొదటిదిగా దేవీ టాకీస్‌కు గుర్తింపు
- ఇప్పుడా రెండూ తెరమరుగు
- షాపింగ్ మాల్స్, ఐనాక్స్‌తో మారిన గాజువాక రూపురేఖలు

వినోద రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రజల ఆకాంక్షలు, అభిరుచికి అనుగుణంగా మార్పు చెందుతోంది. ఈ క్రమంలో సినిమా థియేటర్ల ముఖచిత్రం పూర్తిగా మారింది. టూరింగ్ టాకీస్‌లు కనుమరుగై ఐనాక్స్‌లు వచ్చాయి. ఈ క్రమంలో పారిశ్రామిక ప్రాంతంలో తొలి తరంలో పరిచయమైన టూరింగ్ టాకీస్‌లు కనుమరుగయ్యాయి. కొన్ని థియేటర్ల స్థలాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని వాణిజ్య కార్యకలాపాలకు వేదికలయ్యాయి.



షాపింగ్ మాల్ నడుస్తున్న శేషమహల్ థియేటర్

గాజువాక: పారిశ్రామిక నగరంగా ముద్ర వేసుకున్న ప్రస్తుత గాజువాక 1970వ దశకంలో చిన్న పంచాయతీగా ఉండేది. సుమారు 1000 కుటుంబాలుండేవి. ఆ పక్కనే చినగంట్యాడ పంచాయతీ, దానికి ఎగువన పెదగంట్యాడ పంచాయతీ ఉండేవి. ఈ ప్రాంతవాసులు అప్పట్లో సినిమా చూడాలంటే ఏకైక మార్గం జోగవానిపాలెంలోని నర్సింహా టూరింగ్ టాకీస్. దీన్ని 1974లో నాయుడు అనే వ్యక్తి ఏర్పాటు చేశారు. గాజువాకకు మొట్టమొదటి సినిమా థియేటర్ ఇదే. ఇక వర్షం వచ్చినా, కరెంటు పోయినా సినిమా ప్రదర్శనకు సెలవు.

1982 తర్వాత కొత్త థియేటర్లు

దేవీ టూరింగ్ టాకీస్ విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలోనే గాజువాకలో కొత్త థియేటర్ల నిర్మాణం ప్రారంభమైంది.1982లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణ పనులు ముమ్మరం కావడంతో గాజువాక ప్రాంతం అభివృద్ధి కూడా వేగవంతమైంది. దీంతో గాజువాకలో శేషమహల్, మోహినీ థియేటర్ల నిర్మాణం ప్రారంభమైంది. శేషమహల్ గాజువాకలో పూర్తిస్థాయి వసతులతో ఏర్పాటు చేసిన తొలి థియేటర్. రానురానూ జనాభా పెరగడంతో గాజువాకలో థియేటర్లు పెరిగాయి. శేషమహల్ పక్కనే లక్ష్మీకాంత్ థియేటర్, దానికి మరికొంత దూరంలో కన్య, శ్రీకన్య థియేటర్‌వచ్చాయి. కొద్ది కాలానికి శేషమహల్ థియేటర్‌పై యూఎస్సెస్సార్ థియేటర్‌ను నిర్మించి కొద్ది సంవత్సరాలపాటు నిర్వహించారు. ఆ తర్వాత దాన్ని మూసేశారు. దాన్ని మూసేసిన మరికొంత కాలానికి శేషమహల్ కూడా మూత పడింది. ప్రస్తుతం ఆ థియేటర్‌లో ఎదురుభాగంలో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారు.



అందుబాటులోకి ఐనాక్స్‌లు

1990 తర్వాత గాజువాకలో థియేటర్లు బాగా పెరిగాయి. లక్ష్మీకాంత్ థియేటర్‌ను మూడు థియేటర్లుగా అభివృద్ధి చేశారు. మోహినీ థియేటర్‌ను కూడా మూడు థియేటర్లుగా మార్చారు. కన్య, శ్రీకన్య థియేటర్‌పై అదనంగా మరో థియేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత పెదగంట్యాడలో అరుణా థియేటర్, కూర్మన్నపాలెంలో అన్నపూర్ణ థియేటర్ అందుబాటులోకి వచ్చాయి. షీలానగర్‌లో డ్రైవ్ ఇన్ థియేటర్ సహా మరో మూడు సినిమా హాళ్లు ప్రారంభమయ్యాయి. ఆటోనగర్ జంక్షన్‌వద్ద గ్లోబెక్స్ కాంప్లెక్స్ పేరుతో ఐదు థియేటర్లను ఒకేసారి ప్రారంభించారు. పాతగాజువాక జంక్షన్‌లో తాజాగా నిర్మించిన సీఎంఆర్ సెంట్రల్‌లో రెండు ఐనాక్స్ థియేటర్లు ఏర్పాటు చేశారు. అగనంపూడిలోని ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో మరో రెండు ఐనాక్స్ థియేటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆ థియేటర్లు తెరమరుగు

నర్సింహా టూరింగ్ టాకీస్‌ను మూసేసిన తర్వాత కొన్నాళ్లపాటు గాజువాక ప్రాంతంలో సినిమా థియేటర్ లేదు. మళ్లీ కొద్ది కాలానికి పల్లా సింహాచలం సారథ్యంలో బీసీ రోడ్‌లో దేవీ టూరింగ్ టాకీస్ మొదలైంది. దీన్ని బీహార్‌కు చెందిన ఒక వ్యక్తి నిర్వహించేవాడు. అప్పట్లో నేల టిక్కెట్ ధర 25 పైసలు కాగా, బెంచి (బాల్కనీ)కి 50పైసలు ఉండేది. ఈ థియేటర్ సుమారు ఆరేళ్లు నడిచింది. జోగవానిపాలెం, చట్టివానిపాలెం, చినగంట్యాడ, గొంతినవానిపాలెం, పెదగంట్యాడ ప్రాంతీయులు పంటచేల మధ్యలోనుంచి ఈ థియేటర్‌కు నడిచి వచ్చి సినిమాలు చూసేవారు. స్థల వివాదం చోటు చేసుకోవడంతో దేవీ టూరింగ్ టాకీస్‌ను కూడా మూసేశారు.



నర్సింహా టూరింగ్ టాకీస్ ఉండేది ఇక్కడే

పావలా ఉంటే సినిమా..



మా చిన్న వయస్సులో ఇక్కడ ఒకే థియేటర్ ఉండేది. బీసీ రోడ్‌లో ఉన్న దేవీ టూరింగ్ టాకీస్‌లో సినిమాలు చూసేవాళ్లం. పావలా ఉంటే నేల టిక్కెట్ కొనుక్కొని సినిమాకు వెళ్లేవాళ్లం. అప్పటికి నర్సింహా టాకీస్ మూత పడింది. అది ఎన్నాళ్లో నడవలేదు. దీంతో అందరికీ దేవీ టూరింగ్ టాకీసే తెలుసు. ఇక్కడ సినిమా లేకపోతే మల్కాపురంలోని మహాలక్ష్మి టూరింగ్ టాకీస్‌కు వెళ్లేవాళ్లం. ఇప్పుడు అది కూడా మూతపడింది.

– పిల్లల మోహనరావు, గాజువాక

నాటి థియేటర్ల సంగతి తెలియదు



గాజువాకలో మొదట టూరింగ్ టాకీస్‌లు ఉన్నాయన్న విషయం మా తరానికి కూడా తెలియదు. నేను గాజువాకలోనే పుట్టి పెరిగాను. నా వయస్సు 41 ఏళ్లు. మాకు తెలిసిన థియేటర్లు శేషమహల్‌తోపాటు ఆ తర్వాత వచ్చినవే. పాత థియేటర్ల సంగతి పెద్దలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంటుంది. ప్రస్తుతం అత్యాధునిక సౌకర్యాలతో ఐనాక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు గాజువాక ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మరిన్ని థియేటర్లు ఆధునిక హంగులతో త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

– కె.సుమన్, గాజువాక

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అగనంపూడి: శాంతిభద్రతల పరిరక్షణ, సంఘ విద్రోహుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులు త్యాగాలను మననం చేసుకోవడం సముచితమని దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్‌ఐ కె.టి.ఆర్. లక్ష్మి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మాన ప్రాణాలు కాపాడడంలో ఎందరో పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రకాశరావు, హెడ్ కానిస్టేబుల్ డి.రాజు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ లక్ష్మి, హెచ్‌ఎం ప్రకాశరావు

హాకీ జట్టులో ఇస్లాంపేట విద్యార్థినికి చోటు

పెదగంట్యాడ: త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విశాఖ జిల్లా జట్టులో ఇస్లాంపేట విద్యార్థినికి చోటు లభించింది. ఈ నెల 23న ఉమ్మడి విశాఖ జిల్లా అండర్–14 హాకీ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లలిత బుద్ర ప్రతిభచూపి జట్టులో స్థానం సంపాదించింది. ఈ మేరకు ఆ విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నరసింహమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.



లలిత బుద్ర

రసవత్తరంగా కబడ్డీపోటీలు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ విజయనగరం పరిధిలోని అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. వివిధ అనుబంధ కళాశాలల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో విజ్ఞాన్ కళాశాల ద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే క్రీడాస్ఫూర్తితో పాటు పోటీతత్వం, పట్టుదల, స్నేహభావం ఉంటాయన్నారు. క్రీడా కమిటీ కార్యదర్శి సీహెచ్.రాంబాబు సారథ్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఫిజికల్ డైరెక్టర్లు పి.వి.ఎస్.రమణ, జి.ప్రశాంత్, భారతి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో బాణసంచా విక్రయాలు ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోఆపరేటివ్ స్టోర్స్ అందిస్తున్న సేవల్లో భాగంగా సభ్యులకు నాణ్యమైన బాణసంచా సరసమైన ధరలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు డి.వి. నాగబాబు, కార్యదర్శి ఆకుల నూకరాజు, ఉపాధ్యక్షులు జి. నాగభూషణం నూక, డైరెక్టర్లు బి.టి. జగదీష్, లోకేష్, ఎ.వి.ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 31న మధ్యాహ్నం 12 గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయన్నారు.

నా భర్త మృతిపై వాస్తవాలు బయటపెట్టాలి

- సీపీకి బంగారమ్మ వినతి

అగనంపూడి: తన భర్త ఎలా మృతి చెందాడో బయట పెట్టాలని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి, దివగంత తాతారావు భార్య బంగారమ్మ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీకి వినతి పత్రం అందజేశారు. 2017లో స్టీల్‌ప్లాంట్‌లో తన భర్త విధులు నిర్వహించిన చోటే మృతి చెందాడన్నారు. ఉక్కు అధికారులు ఫిర్యాదు మేరకు ప్రమాదశాత్తు మృతి చెందినట్టు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అయితే కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిన సమయంలో ఉక్కు యాజమాన్యం మాట మారుస్తూ వస్తోందన్నారు. భర్త మృతిపై ఏవేవో కట్టు కథలు వల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం ఇవ్వాల్సిన అవసరం లేదని అధికారులు రాతపూర్వకంగా తెలియజేశారన్నారు. ఈవిషయంలో పోలీసులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు. న్యాయం చేయాలని కోరారు.



బంగారమ్మ

అప్రెంటిస్ మేళాకు స్పందన

అగనంపూడి: హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్ సంస్థలో అప్రెంటిషిప్ కోసం శుక్రవారం 85వ వార్డు లంకెలపాలెం సమీపంలోని హైటెక్ ఐటీఐలో మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐ పూర్తి చేసిన 127 మంది అభ్యర్థులు హాజరు కాగా వారి అర్హత పత్రాలను పరిశీలించారు. ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో సమాచారం అందించనున్నట్టు కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ శ్రీనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కంపెనీలో ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్ మొత్తం 170 ఖాళీలు భర్తీ చేయనున్నామని, శిక్షణ అనంతరం ఉద్యోగం చేయాలనుకొనే వారికి నెలకు రూ.17వేల జీతం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గినాయుడు, నిస్ట్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అగనంపూడి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

అగనంపూడి: అగనంపూడి, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీలు, పరిసర గ్రామాలను కలిపి అగనంపూడి కేంద్రంగా రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని అగనంపూడి నాయకులు కోరారు. విశాఖ వచ్చిన మంత్రిని నాయకులు శుక్రవారం కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని, గాజువాక రెవెన్యూ పరిధిలో ఉంటూ పరవాడ మండల విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న పాఠశాలలను గాజువాక మండలం, విశాఖ జిల్లాలో విలీనం చేయాలని నాయకులు బి.సత్యనారాయణ, కె.దశేంద్ర, కె.శ్రీనివాసరావు, పి.సత్యారావు, వి.రాజు ఎ.ఈశ్వరరావు కోరారు.



ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్రమ నిర్మాణాల తొలగింపు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీలో అక్రమ నిర్మాణాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. గాజువాక మండలం ఫార్మాసిటీ కాలనీలో సర్వే నంబర్ 231లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు సాగిస్తుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు నిర్మాణాలు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌డీసీ రమామణి మాట్లాడుతూ అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శభాష్.. పోలీస్

ఉక్కునగరం: టీచర్ మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన అమ్మాయిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు గాలించి గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-8లో నివసిస్తున్న పైడిరాజు కుమార్తె దువ్వాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. టీచర్ మందలించారని ఇంటి నుంచి సాయంత్రం 6 గంటలకు బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు ఆమె కోసం చుట్టుపక్కల గాలించి రాత్రి 8 గంటలకు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అమ్మాయి వద్ద ఉన్న ట్యాబ్ టవర్ లొకేషన్ ఆధారంగా అనకాపల్లి దగ్గర కొత్తూరు వద్ద ఉన్నట్టు గుర్తించారు. ఆ అమ్మాయికి స్టీల్‌ప్లాంట్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ కేశవరావు తెలిపారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్. రాజు అన్నారు. ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెయిన్ గేటు వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలపై బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఇంటి నుంచి బయల్దేరేటప్పుడు తమ గురించి ఆలోచించే కుటుంబీకుల గురించి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు ఎల్లపు సాంబశివరావు, ఎం. రాము, ఈశ్వరరావు, మదీనా భాష, డి. భారతితో పాటు భద్రతా విభాగం అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.

లైన్‌మెన్లకు గాయాలు

పెదగంట్యాడ: మండలంలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి ఇద్దరు లైన్‌మెన్లకు గాయాలయ్యాయి. వివరాలు..వై ప్రకాష్, త్రినాథరావు ఈపీడీసీఎల్ పెదగంట్యాడ అర్బన్ కేంద్రంలో ఎనర్జీ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో శుక్రవారం సాయంత్రం మరమ్మతులు నిర్వహించేందుకు వీరు 11కేవీ స్తంభాలు ఎక్కారు. అయితే రిటర్న్ సప్లై రావడంతో షాక్‌కు గురై అదుపు తప్పి స్తంభాల పై నుంచి ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో తోటి సిబ్బంది వారిని గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇద్దరికీ ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పారని ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.